
# మరోనాయకుడి కథ

మన్నం శారద



ఆర్. టి. సి. కౌంటర్ ముందు క్యూ చేంతాడులా వుంది. సహజంగా అందరూ గుంటూరు చేంతాడుఅంటారు. అయితే ఒంగోలు బావుల లోతు తెలియని వారే గుంటూరు బావుల్ని చూసి గుడ్లు తేలే స్తారు. పాతాళలోకం చూడాలని ఎవ్వ డైనా సరదాపుడితే ఓసారి ఒంగోలు బావిలో దూకితే చాలని నా వుద్దేశ్యం.

క్యూలోవున్న జనాన్నిచూస్తే విజయ వాడ వెళ్ళే నాన్‌స్టాపు బస్సులో నాకు టిక్కెట్టు దొరకదని ఖచ్చితంగానె తెలు స్తోంది. ఆ బస్సు తర్వాత మరో గంటకి బస్సువుంది. కాని అది నన్ను ఆఫీసు టైంకి విజయవాడ చేర్చలేదు.

ఎలాగోలా ఈ రోజు టైంకి ఆఫీసుకు చేరకపోతే ఆఫీసరు చేత ముఖం వాచేట్లు చివాట్లు ఖాయం. పైగా ఈ రోజు కాన్ఫ రెన్సులో డిస్కస్ చేయాల్సిన ఫైల్సు నా సీటునుంచే చాలా వున్నాయి.

టిక్కెట్టు దొరకదని తెలుస్తూనేవున్నా నా ప్రయత్నం నేను చేయాలని అలాగే నిలబడ్డాను. టైంకి ఆఫీసుకెలా జేరాలా అని మనసంతా ఒకటే కంగారు!

ఛండశాసనుడి లాంటి ఆఫీసరు. కాదూ కూడదంటే కాళ్ళావేళ్ళా పడి పండక్కి వూరు కదలటానికి పర్మిషను సంపాదించి సోమవారం ఆఫీసు టైంకి ఖచ్చితంగా వచ్చి వాలతానని చేతిలో చెయ్యేసినంత పనిచేసి ఏలూరు మా అత్తారింటికివచ్చేను.

ఎంతయినా యిది పెళ్ళయ్యేక నా మొదటి సంక్రాంతి!

అత్తవారిచ్చే కానుకల సంగతి ఎలా వున్నా, మామగారు చేసే మర్యాదలు అత్తగారి పిండివంటలు, భార్యామణి సిగ్గు దొంతరలమధ్య విసిరే వాలుచూపులు, మర దళ్ళ సరసోక్తులు- వీటన్నిటినీ జీవితంలో తిరిగి సంపాదించగలనా.

అందుకే ఎవరూ చూడ్డంలేదని గట్టి ధైర్యంతో ఆఫీసరుగాడి గడ్డం పుచ్చుకుని బ్రతిమలాడి ఆ రాత్రి బస్సుకే వెళ్ళి మా అత్తారింట్లో వాలేను.

ఆశించిన దానికన్నా ఘనంగానే మర్యా దలు, అరిగి చావకుండా తినుబండారాలు, నిముషనిముషానికి సతాయిస్తూ నాకు, నా భార్యామణికి పట్టుమని పదినిముషాలుకూడా ఏకాంతం దొరకనివ్వని సిసింద్రీల్లాంటి మరదళ్ళూ కాలం యిట్టే గడచిపోయింది.

ఎందుకైనా మంచిదని ఆదివారం సాయంత్రమే బయల్దేరదామనుకున్ననాకు "అదేవిటి బాబూ! ఈ పూట బయల్దేరు తావా? కనుమ రోజు కాకయినా కదు ల్తుంటా?" అన్న అత్తగారి మాటలు ఒకింత అడ్డు బంధమైంది.

"అబ్బే, నా కలాంటి పట్టింపుల్లేవండీ, రేపు నేను ఆఫీసుకెళ్ళి తీరాలి" అని ఆద ర్శంగా చెప్పేసి గదిలో కొచ్చి సూట్ కేసు సర్దుకోసాగేను.

పొట్లాల్లాంటి అందమైన చేతులు నా భుజాల మీదుగా వొచ్చి బంధించటంతో అవి నా భార్యామణి తాలూకు చేతులే అని గ్రహించి "ఏవిటి?" అన్నాను పరవ శంగా.

"ఇప్పుడే వెళ్ళి తీరాలా?" అంది గోముగా నా తలని తన గుండెల కానిస్తూ.

అంతే కరిగిపోయేను. అమాంతం "వెళ్ళనుగాక వెళ్ళను" అని చెబితే నాదెంత బోడి ఉద్యోగం అనుకుంటుందో (ని "వెళ్ళకపోతే ఎలా? డ్యూటీ!" అన్నాను బింకంగా.

"రేపొద్దుటే బస్సు కెళ్ళచ్చులెండి" అంటూ సూట్‌కేసు ఓ ప్రక్కకి తోసే సింది.

అలా భార్యామణికి బానిసయి ఆఫీసరు సంగతి మరచిపోయినందుకు నన్ను నేను ఎన్నిసార్లు, ఎన్ని రకాలుగా తిట్టుకున్నా ప్రయోజనం లేదని తెల్సి నా ఆఫీసరు ముఖం భూతద్దంలో కన్పించి నన్ను భయ పెడ్తూనే వుంది.

కాళ్ళు పీకి పీకి అటూ, యిటూ చూడ సాగేను.

కౌంటరు తలుపులు యింకా తెరుచుకో లేదు.

ఇంతలో ఎత్తుగా, బలిష్టంగావున్న శరీ రాన్ని అందమైన ఖరీదుగల బట్టల్తో కప్పుతూ వాటిపైన యింపుగా వాసనలు వెదజల్లే ఇంటిమేట్ స్ప్రే చేసి వి. ఐ. పి. బ్రీఫ్‌కేసు పట్టుకుని, ఖరీదైన ఫారిన్ కూలింగ్ గ్లాసెస్‌లోనుంచి క్యూని దీక్షగా అట్నుంచి యిటు, యిట్నుంచిఅటూ పరిశీ లిస్తున్న ఓ ఖరీదైన వ్యక్తిపై పడింది నా దృష్టి.

క్యూ మధ్యగావున్న నాకే టిక్కెట్టు దొరకదని అనుమాన పడ్తోంటే క్యూలో నిలబడకుండా "అడ్డదారేవైనా వుందా?" అన్నట్లు క్యూని ఎగాదిగా చూస్తోన్న అతన్ని చూస్తే వళ్ళుమండింది.

పది నిముషాల్లో ఆ ఆగంతకుడు

పోలీసు కుక్కలా ఓ యిద్దరు వ్యక్తుల్ని పట్టుకు వాగ్యుద్ధానికి ఉయారంయ్యేడు.

క్యూలో నిలబడి నిలబడి విసిగిపోయిన మాకు కాస్త కాలక్షేపం దొరికింది.

ఇంతకూ అసలు విషయం ఆ యిద్దరి వ్యక్తుల చేతుల్లో కౌంటరు తెరవకుండానే బయల్దేరబోయే నాన్‌స్టాప్ బసీ తాలూకు టిక్కెట్లు వున్నాయి. ఆ విషయం తెలిసేసరికి మాలో చాలామందికి వళ్ళు మండుకొచ్చింది. కాని ఏం చేస్తాం?

"దిసీస్ టూమచ్! కౌంటర్ తెయకుండా మీకెలా వచ్చాయి టిక్కెట్లు? అటు క్యూ చూడండి ఎంత పొడవుందో! పాపం వాళ్ళంతా ఎండలో నిలబడి ఆడామగాతేడా లేకుండా చంటి బిడ్డలతో ఎలా నలిగిపోతున్నారో! చెప్పండి మీకెలా వచ్చేయీ టిక్కెట్స్!" అతను తీవ్రంగా పోట్లాడుతున్నాడు.

ఆ యిద్దరూ మౌనాన్ని ఆశ్రయించేరు. ముఖ ముఖాలు చూసుకుంటున్నారు.

గల్ఫ్ దేశాలలో
ఉద్యోగావకాశాలు

మిడిల్ ఈస్ట్ దేశాలలో డైరెక్టు ఉద్యోగాలు పొందేందుకు ఉచిత సాహిత్యం. మరియు గైడెన్స్ కొరకు వ్రాయండి. స్వంత చిరునామా కలిగిన స్టాంపు అంటించిన కవరు పంపండి.

Globe Service Information Centre (Regd.) (AV-2)
WZ-69, Nangli Jalib,
New Delhi-110058.

వివాహాది శుభ కార్యములకు-
విందు భోజనములకు,
ప్రతి నిత్యము మీ ఇంటి వాడుకకు.
నమ్మకమైన
పాత బియ్యం
పరిశుభ్రముగా బాగు చేయబడినవి.
శ్రీవిజయ రైస్ కంపెనీ
గవర్నరుపేట విజయవాడ-2
ఫోను చేసిన వెంటనే హోమ్‌డెలివరీ చేయబడును
ఫోన్: 73704

పలావ్, బిరియానికి పనికివచ్చు
సువాసనగల భాసుమతి
బియ్యంకూడా లభించును.

అతనంతటితో ఆగలేదు. క్యూదగ్గరకి సరాసరివచ్చి "ఏవండీ, ఏవిటి మీరంతా అలా బెల్లం కొట్టిన రాళ్ళలా నిలబడి చూస్తారు? అన్యాయాన్ని యెదుర్కోవాలని ఒక్కరికైనా అన్పించటంలేదా?" అన్నాడు కోపంగా.

"ఏం చేస్తామండీ?" అన్నాడు నా ముందు తల పండిన ముసలాయన నీరసంగా.

అతను కోపంగా చూస్తూ "చెయ్యాలనుకుంటే ఏదైనా చెయ్యొచ్చు. దేనికైనా కొన్ని రూల్స్ వున్నాయి. అవి అతిక్రమిస్తే వాటిని ఎదుర్కోవటానికి మనకి హక్కు వుంది. ఇక్కడ యింతమంది రూల్స్ ననుసరించేకదా క్యూలో నిలబడి కౌంటర్ ముందు పడిగాపులు పడివున్నది! వీళ్ళందర్నీ వెర్రి వెధవల్ని చేసేస్తూ అప్పుడే వచ్చి అలసిపోకుండా టిక్కెట్సు కొంతమందికి దొరికినప్పుడు "ఏం జేస్తామండీ" అనటం నిజంగా సిగ్గుచేటయిన విషయం!" అన్నాడు ఆవేశంతో వూగిపోతూ.

అంతే! క్యూలో కలకలం బయల్దేరింది.

"అవునండీ! ఇదేదో తేల్చుకోవాలి!" అంటున్నారు నాలాంటి యువకులు కొందరు.

ఆడాళ్ళు కూడా వాదనకి దిగేరు.

అంతలో ఒకాయన వచ్చి చేతులు గట్టిగా పట్టుకుని ఆ ఖరీదైన మనిషిని అటు పక్కగా తీసుకుపోయేడు. అతను వెళ్తూ వెళ్తూకూడా గట్టిగా అన్యాయాన్ని గర్హిస్తున్నాడు.

మేమూ ఆశగా చూస్తున్నాం. అతను ఏదో తేల్చుకునే వస్తాడు. అతను మామూలు రకంకాదు. విప్లవాన్ని నడిపే నాయకుడి లక్షణాలున్నాయి. నేను ఆఫీసరు సంగతి యించుమించు మరచిపోయేను. జరుగుతున్న అన్యాయాన్ని చూసి ఆవేశం ముంచుకొస్తోంది. అతని రాకకోసం ఎదురుచూస్తున్నాను.

పావుగంట గడిచింది. అతని జాడలేదు.

లోపల అంతర్యుద్ధం గట్టిగానే జరుగుతుండాలి!

క్యూలో ఆసక్తి పెరుగుతోంది. అందరూ అతనికోసమే ఎదురు చూస్తున్నారు. విప్లవాన్ని నడిపిస్తున్న నాయకుడు సగంలో అంతర్ధానమైనట్లు జనం ఏం చేయాలో తోచక క్యూలో నిలబడి వుసూరుమంటూ నిట్టూర్పులు విడుస్తున్నారు.

ఇంతలో కౌంటర్ తలుపులు తెరుచుకున్నాయి.

అంతే! జనం టిక్కెట్ల సందడిలో



## నా సంక్షిప్త జీవిత వివరాలు

స్వస్థలం కాకినాడ, ప్రస్తుతం ఉద్యోగరీత్యా హైదరాబాదు వాసం. ఆర్ & బి డిపార్టుమెంటులో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం. చిన్ననాటినుంచి రచనా వ్యాసంగంలో, చిత్రలేఖనంలో అభిరుచి, ప్రవేశం వున్నాయి. నా మొదటి కథ "అడవి గులాబి" "ఆంధ్రజ్యోతి" సచిత్ర వారపత్రికే ప్రచురించింది. తర్వాత నా వివిధ కథలు నేడు వస్తున్న అన్ని పత్రికల్లోనూ ప్రచురింపబడ్డాయి. ఆంధ్రజ్యోతి దినపత్రిక నవలల పోటీలో నా "గౌతమి" నవలకు ప్రథమ బహుమతి లభించింది.

వివాహమయింది మాకు యిద్దరు పిల్లలు. వంశీకృష్ణ, శిరీష

చెప్పదలచుకున్నది ఏ విషయమైనా హృదయానికి హత్తుకునేలా చక్కని శైలితో వ్రాసిన ప్రతి కథా నాకు యిష్టమే.

ఇంతకంటే నా గురించి చెప్పుకోవాల్సిన విశేషాలు లేవు.

—మన్నెం శారద

పడిపోయేరు!

నేను అతని కోసమే ఓ పక్క చూస్తూ మందకొడిగా జరుగుతున్న క్యూలో మెల్లి మెల్లిగా ముందుకు జరుగుతున్నాను.

నాకు ముందు పదిమంది వుండగానే కౌంటరు తలుపులు మూసుకుపోయేయి.

నేను నిస్పృహగా నిలబడి అతని కోసం చూస్తున్నాను.

విజయవాడ నాన్‌స్టాప్ నిండుగా బయల్దేరింది.

బస్‌వేపు నిరాశగా చూసేను.

డ్రైవరుకు ప్రక్కగా స్పెషల్ సీట్లో దర్జాగా త్రిబుల్ ఫైవ్ వెలిగించి నీటుగా కూర్చున్న అతన్ని చూడగానే నా మతిపోయినంత పనయింది.

ఆశ్చర్యం నుంచి తేరుకునే లోపున నాన్‌స్టాప్ నా కళ్ళలో దుమ్ముకొట్టి వేగాన్ని పెంచుకొని ముందుకి సాగిపోయింది.